నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
3 | కరీంనగర్, గురువారం 24 ఏప్రిల్ 2025 | PEDDAPALLI



నిర్మానుష్యంగా 'ఖని' ప్రధాన రహదారి

## భానుడు భగ భగ

భానుడు భగ్గుమంటున్నాడు. మూడు నాలుగు రోజుల నుంచి విశ్వరూపం చూపుతున్నాడు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సుర్రుమంటూ, మధ్యాహ్నంకల్లా మాడు పగులగొడుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 42 డిగ్రీల దాకా నమోదవుతుండగా, జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పది దాటిందంటే బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. బుధవారం రామగుండంలో అత్యధికంగా 42.8 డిగ్రీలు నమోదయ్యాయి.

- కోల్‌సిటీ, ఏప్రిల్ 23





పెద్దపల్లిలో ఉగ్రదాడికి నిరసనగా మౌనం పాటిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు

### ఉగ్రమూకల దాడి అత్యంత బాధాకరం

అమాయకులపై ఉగ్రమూకలు దాడి చేసి పొట్టన బెట్టుకోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు పెద్దపల్లి తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్‌కు ముందు నేతలంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రదాడి ఘటనను తీవ్రంగా ఖండించారు.

- కల్వకుంట్ల కవిత

## కార్మిక హక్కుల కోసం

# పిడికిలి బిగిద్దాం

- బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడుదాం
- రాష్ట్రాన్ని, సింగరేణిని కాపాడుకుందాం
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 25న ధర్నాలో పాల్గొందాం
- 27న రజతోత్సవ సభకు సైన్యంలా కదులుదాం
- టీబీజీకేఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ, గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



గోదావరిఖనిలో నినదిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

సింగరేణి సంస్థ, కార్మికులకు మన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎంత చేసిండో అంత మరిచిపోతరా..? చెప్పుడు మాటలు, అబద్ధపు హామీలు నమ్మి మీరెట్ల మోసపోతరు? ఒక్కసారి గుండె మీద చేయి వేసుకొని చెప్పండి. కేసీఆర్ లేకుంటే సింగరేణి సంస్థ ఎట్లుండేదో గుర్తుకు తెచ్చుకోండి. ఇప్పటికి మించిపోయింది లేదు. ఆగమవుతున్న రాష్ట్రాన్ని, సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు మళ్లీ పిడికిలి బిగించి పోరాడుదాం. మీ సోదరిగా ముందుండి నడుస్త. బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టేందుకు నా వెనుక మీరు నడవండి చాలు. వచ్చే సింగరేణి ఎన్నికల్లో మళ్లీ టీబీజీకేఎస్ జెండా ఎగరేద్దాం.

- కల్వకుంట్ల కవిత

కోల్‌సిటీ, ఏప్రిల్ 23 : సింగరేణి కార్మికుల హక్కుల కోసం పిడిగిలి ఎత్తి పోరాడుదామని నిజామాబాద్ ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన పార్టీలు, యూనియన్లను బొంద పెడుదామని, వచ్చే సింగరేణి ఎన్నికల్లో 11 ఏరియాల్లో టీబీజీకేఎస్ జెండా ఎగరవేద్దామన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సైన్యంలా కదలిరావాలని, మరో కుంభమేళాను తలపించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆమె పెద్దపల్లి జిల్లాలో పర్యటించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఆ తర్వాత గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆమెకు ప్రధాన చౌరస్తాలో యూనియన్ నాయకులు భారీ గజ మాలతో స్వాగతం పలికారు. అనంతరం ఉగ్రమూకల దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. తర్వాత సమ్మేళనానికి హాజరైన కార్మికులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నాడు సింగరేణి అంటే బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి ఒక్కటే అన్నట్టు ఉండేదని, తాను ఓ సందర్భంలో దుబాయికి వెళ్లినప్పుడు అక్కడి ఆయిల్ బంకర్‌ను చూస్తే రామగుండంలో ఉండే వేడికంటే మూడింతల వేడిలో పని చేసేవారని గుర్తు చేశారు. అప్పుడు వాళ్లను చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని, మళ్లీ రెండోసారి సింగరేణి బొగ్గు బాయిల దిగి కార్మికులను చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని యాదికి తెచ్చుకున్నారు. నాటి జాతీయ సంఘాలు సింగరేణి సంస్థను ఆ పరిస్థితిలోకి తీసుకవస్తే తాను, ఇక్కడున్న టీబీజీకేఎస్ నాయకులమంతా కలిసి కేసీఆర్ దగ్గరకు వెళ్లి చెప్పామని, వెంటనే అప్పటి సీఎండీతో మాట్లాడి సింగరేణిలో నూటికి 95 శాతం డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని పట్టుబట్టి మరీ ఒప్పించిన విషయాన్ని వివరించారు. సింగరేణికి అంత చేసిన కేసీఆర్‌ను మరిచి కార్మికులు మోసపోవడం చాలా బాధేసిందన్నారు. సింగరేణి సంస్థ, కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న టీబీజీకేఎస్‌ను త్వరలోనే ప్రక్షాళన చేయబోతున్నామని, యూనియన్‌కు కొత్త నాయకత్వాన్ని నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. కార్మికుల సోదరిగా ఇక తాను ముందుండి కొట్లాడుతానని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకవచ్చిన లేబర్ కోడ్స్ ఎంత భయంకరమో ఒకసారి మీరే అధ్యయనం చేయాలని సూచించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. నాడు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేసుకున్న ఒప్పందాలనే ఇప్పుడు మూడు జెండాల వాళ్లు తామేదే సాధించినట్లు చెప్పుకోవడం అవివేకమన్నారు. నాడు కేసీఆర్ నైనీ బ్లాక్ ప్రాజెక్టును సింగరేణి సంస్థకు ఇవ్వాలని ఒప్పందం చేసుకుంటే ఇప్పుడు భట్టి విక్రమార్క పోయి తామేదో సాధించి తీసుకవచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీబీజీకేఎస్‌పై కార్మికులకు ఉన్న ఆదరణ ఎప్పటికీ తరగదని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే సింగరేణిలో గెలుపు ఖాయమన్నారు. సింగరేణిలో మారుపేర్ల కార్మికులు, ఓవర్‌మెన్ల సమస్యను పరిష్కరించే బాధ్యత యూనియన్ తీసుకుంటుందన్నారు. అమలు కాని హామీలు, అబద్ధాలతో గెలిచిన సంఘాలకు, పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 25న అన్ని జీఎం కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని, 27న ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు మన సింగరేణీయులంతా సైన్యంలా కదిలి రావాలని, మరో కుంభమేళాను తలపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఎమ్మెల్సీ కవితకు సింగరేణి టోపీని తొడిగి ఘనంగా సత్కరించారు. శ్రీరాంపూర్, రామగుండం ఏరియాలకు చెందిన పలు యూనియన్ల నాయకులు టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రాంమ్మూర్తి, రాకేశ్, కౌశికహరి, దాసరి ఉష, నూనె కొంరయ్య, పెంట రాజేశ్, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభకు సైన్యంలా కదలాలి

బొగ్గు గనులకు కేంద్రం పెద్దపల్లి జిల్లా. ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించింది. సింగరేణి సమ్మె చేస్తూ తట్టా, చెమ్మస్ కింద పడేస్తేనే ఢిల్లీకి ఉద్యమ సెగ తగిలింది. అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ నిలబడ్డ ఏకైక పార్టీ బీఆర్ఎస్. తెలంగాణలోని ప్రతి పల్లె, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తితో పార్టీ పెనవేసుకున్నది. రజతోత్సవ వేడుకలను ఏడాది పాటు నిర్వహిస్తం. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు సైన్యంలా కదలాలి. మరో మహా కుంభమేళాను తలపించాలి. పల్లెపల్లె నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి. రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోవాలి.

- పెద్దపల్లిలో కల్వకుంట్ల కవిత

### మన సత్తా చాటాలి

ఉద్యమ సమయంలో తెలంగాణ యాస, భాషను అబాసుపాలు చేస్తున్న సమయంలో మన సంస్కృతీ సంప్రదాయాలను చాటి చెప్పిన వనిత కల్వకుంట్ల కవిత. చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరుగబోతున్నది. పెద్దపల్లి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలి. మన సత్తా చాటాలి.

- పెద్దపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



సభ పోస్టర్‌ను అంటిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశం గౌడ్

## గులాబీ దండులా రావాలి

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత
- అంతర్గాం, చల్‌గల్ క్లస్టర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, బస్ ఇన్‌చార్జిలతో సమావేశం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 23: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీదండులా కదలిరావాలని పార్టీ శ్రేణులకు జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, చల్‌గల్ క్లస్టర్ గ్రామాల్లో మాజీమంత్రి రాజేశం గౌడ్‌తో కలిసి ముఖ్య నాయకులు, బస్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంతర్గాం గ్రామంలో పుష్కలమైన తాగు, సాగునీరందించిన ఘనత రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితదేనని కొనియాడారు. పంట పొలాలు పచ్చగా ఉన్నాయంటే అందుకు కారణం వారేనని చెప్పారు. ఇల్లులేని నిరుపేదలకు 100 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన ఘనత ఎమ్మెల్సీ కవితదేనని ప్రశంసించారు. ఈ నెల 27న గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేసి గులాబీదండులా రజతోత్సవ సభకు బయలుదేరి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండలాధ్యక్షుడు అనంతరావు, తుమ్మ గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు లక్ష్మణ్ రావు, తిరుపతి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సాయి, షఫీ, మల్లేశ్, మురళి, శ్రీనివాస్, రాజం, మల్లయ్య, మహేశ్, పోచమల్లయ్య, రంజిత్, వెంకటేశ్, గంగారాం, గంగశేఖర్, గంగసాగర్, ముత్యం, గంగాధర్, రాజేశం, దేవన్న, రమేశ్, కిషన్, రాకేశ్, గోపాల్, వెంకన్న, గంగారెడ్డి, చామల్ పాల్గొన్నారు.



సిరిసిల్ల 37వ వార్డులో ఇంటికి వెళ్లి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎల్కతుర్తికి రండి

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్
- ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి సభకు రావాలని ఆహ్వానం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 37వ వార్డులో బుధవారం మాజీ కౌన్సిలర్ దిడ్డి మాధవి ఆధ్వర్యంలో వినూత్న ప్రచారం చేశారు. ఇంటింటికీ డప్పు చప్పుళ్లతో వెళ్లి బొట్టు పెట్టి, ఆహ్వాన పత్రికలు అందిస్తూ సభకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఇంటి పార్టీ అని, సభకు తాము స్వచ్ఛందంగా తరలివస్తామని ప్రజలు చెబుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు దిడ్డి రాజు మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు సంబంధించి ప్రత్యేక ఆహ్వాన పత్రికలు ఇంటింటికీ అందించి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, వేముల శ్రీనివాస్, కూరపాటి భూమేశ్, వేముల తిరుపతి, ముదారపు లలిత, ఎక్కలదేవి శ్యామల, గంగుల సదానందం, మచ్చ సురేశ్, గాజుల ఎల్లయ్య, జిందం రాజేశం, బొద్దుల రమేశ్, పచ్చునూరు తిరుపతి, గజ్జల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు

## 'ఉగ్ర' దాడిపై ఆగ్రహజ్వాల

ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దహనం

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 23 : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. పలుచోట్ల ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేసి, దాడిని తీవ్రంగా ఖండించారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకుల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యాటకులపై దాడి చేయడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. పర్యాటకులకు భద్రత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలొద్దీన్, నాయకులు షౌకత్, సాబీర్, ఇర్ఫాన్, ఫక్రుద్దీన్, మన్సూర్ పాల్గొన్నారు.



వెంకటాపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు

# తూకం వేసినా.. కేంద్రాల్లోనే బస్తాలు

- లారీలు రాక రైతులకు తప్పని తిప్పలు
- వానొచ్చి తడిస్తే బాధ్యత ఎవరిదని నిలదీతలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 : ఒకవైపు ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన చెందుతుండగా.. తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలోనూ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. లారీలు రాకపోవడంతో బస్తాలు కేంద్రాల్లోనే మూలుగుతున్నాయి. కేంద్రాల నుంచి గోదాములకు వెళ్తున్నాయా.. లేదా..? అని అడిగే నాథుడే లేకుండా పోయాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజుల క్రితం తూకం వేసిన ధాన్యం లారీ రాకపోవడంతో కేంద్రంలోనే ఉంటున్నదని రైతులు చెబుతున్నారు. వర్షం వచ్చి ధాన్యం తడిసిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడుతున్నారు.

### లారీలు ఎప్పడత్తయో ఏమో..



ఏడెకరాల్లో వరి పంటేసిన. వడ్లన్నీ ఈడికే తెచ్చిన. ఇంకా జోకలేదు. ఏంజెయ్యాలె . ఏమన్నంటే లారీలత్తలెవ్వు అంటున్నరు. ఈడికి నాలుగు రోజులైంది. లారీలు ఎప్పుడత్తయో ఏమో. సర్దాపూర్ గోదాములన్నీ కూడా నిండినయంటున్నరు. బొప్పాపూర్ గోదాముకు వడ్లు తీసుకపోతున్నరట. ఏమన్నజెయ్యనిగానీ వడ్లయితే కల్లంలకెళ్లిపోతె మంచిగుంటది గద. ఎప్పుడు వానత్తదో తెలుత్తలేదు.

- నాగుల శ్రీనివాస్, రైతు (వెంకటాపూర్)

### నాలుగు రోజుల నుంచి వస్తలేవ్



పది రోజుల కింద వడ్లు తెచ్చి కొనుగోలు కేంద్రంల పోస్తే ఎప్పటికప్పుడు జోకి తీసుకోకపోవడంతో ఇబ్బందులైతున్నయ్. మొన్న వానస్తే ఎండబోసిన వడ్లన్నీ కుప్ప జేసిన. అయినా నానిపోయినయ్. వాటిని మళ్లీ ఎండబోసుడైంది. నాకు సొంతంగా 7 ఎకరాలుంటే ఇంకో మూడెకరాలు కౌలుకు తీస్కొని చేసిన. వడ్లన్నీ కల్లంలనే ఉన్నయ్. నాలుగు రోజుల నుంచి లారీలు రాక ఇబ్బందులైతున్నయ్.

- దుండిగాల రాజు, రైతు (వెంకటాపూర్)

# నిలిచిన లారీలు.. రైతుల ఆందోళన

నామాపూర్ గోదాములో ధాన్యం దించుకోవాలని డిమాండ్



దిగుమతి చేసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, ఏప్రిల్ 23 : నామాపూర్ గోదాం వద్ద దాదాపు 20 నుంచి 25 ధాన్యం లోడ్ లారీలు నాలుగు రోజుల నుంచి నిలిచిపోవడంతో రైతులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాముల్లో సిబ్బందిని నియమించుకుని వెంటవెంటనే దించుకోవాలని కోరారు. నేటి లోగా ఆగి ఉన్న లారీల్లోని ధాన్యాన్ని దించుకోకపోతే పెద్ద మొత్తంలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఇక్కడ కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, ఎండీ జహంగీర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ పర్దిపేట వెంకటేశ్, దుర్గాప్రసాద్, తుమ్మనపల్లి శేఖర్‌చారి, ప్రవీణ్ కుమార్, రాములు, శరత్ పాల్గొన్నారు.

## బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి క్షేమం

- కడప జిల్లాలో ఆచూకీ
- బిడ్డను చూసి ఊపిరిపీల్చుకున్న తండ్రి, కుటుంబసభ్యులు
- తిరిగి ఇంటికి పయనం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రియాంక మిస్సింగ్ కథ సుఖాంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఆచూకీ దొరికిందని, ఇంటికి తీసుకొస్తున్నట్లు ఆమె తండ్రి రాజేశం, కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు తాము చెప్పినవారికే ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు ఒత్తిడి, వేధింపులతో ఈ నెల 21న డీపీవో, ఎంపీడీవోలకు రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించిన విషయం తెలిసిందే. అలాగే అధికార పార్టీ నేతల వేధింపులు భరించలేకపోతున్నానని ఇంటి వద్ద ఓ లేఖ రాయడంతో పాటు డైరీలోనూ రాసుకొని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆందోళన చెంది సిరిసిల్ల డీఎస్పీకి ఫిర్యాదు చేయగా, తిరుపతి ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం పోలీసుల సహకారంతో ప్రియాంక తండ్రి రాజేశం, కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లారు. కడప ప్రాంతంలో ఆచూకీ కనిపెట్టారు. కూతురిని చూసి తండ్రి, కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఆమెను తమ వెంట ఇంటికి తీసుకొస్తున్నామని తెలిపారు. సంచలనం సృష్టించిన ప్రియాంక మిస్సింగ్ కథ సుఖాంతం కావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. గ్రామ స్థాయి అధికారిపై ఒత్తిళ్లు చేసి, ఇబ్బంది పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలతోపాటు ఇతర నాయకులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో టెంట్ల కింద నిరీక్షిస్తున్న అభ్యర్థులు

## గందరగోళం.. నిర్వహణలోపం

ప్రహసనంలా రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 23 : రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రహసనంలా మారింది. ప్రచారం, నిర్వహణలోపంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది. అందుకు రామగుండం నగరపాలక సంస్థలో బుధవారం ప్రారంభమైన ఎంపిక ప్రక్రియనే నిదర్శనంగా నిలుస్తున్నది. సబ్సిడీ రుణాల కోసం రామగుండం నగరంలో దాదాపు 15వేల మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపిక కోసం నగర పాలక కార్యాలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే బ్యాంకుల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించడంలో ప్రచార లోపం కారణంగా వేలాది మంది తరలివచ్చి ఇబ్బందులు పడ్డారు. ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి కేవలం ఒకే అధికారి వచ్చి ఇంటర్వ్యూలు చేయడం, గంటల సమయం పట్టడంతో అప్పటిదాకా కార్యాలయం బయట ఎండ వేడిమి తట్టుకోలేక టెంట్ల కింద ఉక్కపోత భరించలేక అభ్యర్థులు నానా అవస్థలు పడ్డారు. రామగుండం, ఎన్టీపీసీ నుంచి పిల్లా పాపలతో వచ్చిన తల్లిదండ్రులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది వెనుదిరిగి వెళ్లిపోయినట్లు తెలుస్తున్నది. మొత్తంగా అధికారుల పర్యవేక్షణ కొరవడి ఇంటర్వ్యూలు గందరగోళంగా మారాయి.